కథా నిలయం
శ్రీకా[illegible]ళం



# బహియం

- ప్రతాప రవిశంకర్

క్లాసులోకి శివరామయ్య మేష్టారు రావటంతోనే వణికిపోయింది ఉమాదేవి. భయంగా రంగబాబు కేసి చూసింది. అతని కళ్ళలోనూ ఆమెకు అదే భయం కనిపించింది.

మేష్టారు కుర్చీలో కూర్చో బోతూ వాళ్ళిద్దరినీ చూపులతోనే కాల్చేసేలా చూశాడు. ఆ చూపుతో వాళ్ళిద్దరూ మరింత భయపడి పోయారు.

మేష్టారు హాజరు పిలుస్తున్న ప్పుడు ఉమాదేవి, రంగబాబు

వణుకుతూనే 'ప్రజెంట్ సార్' అన్నారు.

హాజరు తీసుకోవటం అయి పోయింది. క్లాసులో పిల్లలందరూ మేష్టారినీ, ఆ ఇద్దర్నీ పట్టి పట్టి చూడటం మొదలుపెట్టారు.

శివరామయ్యా మేష్టారు రోజు లాగా హాజరు తీసుకోగానే పాఠం మొదలు పెట్టలేదు. ఓ కుర్రాడిని పిలిచి హెడ్‌మాస్టరు దగ్గర వుండే బెత్తం తీసుకురమ్మని పంపించాడు.

ఉమాదేవి, రంగబాబు బలి ఇవ్వ బడుతున్న జంతువుల్లా ఒకరినొకరు చూసుకున్నారు. మిగిలిన పిల్ల లందరూ వాళ్ళిద్దర్నీ జాలిగా చూసారు.

మేష్టారి కళ్ళు ఎరుపు రంగును పులుముకుంటున్నాయి.

ఆయన చాలా గంభీరంగా వున్నాడు. అది తుఫాను ముందరి గంభీరత అని క్లాసులో పిల్లలంద రికీ తెలుసు. శివరామయ్యా మేష్టారు కోపం వస్తే అసలు మనిషే కాదు.

బయటకు వెళ్ళిన కుర్రాడు బెత్తంతో తిరిగి వచ్చాడు. నిజానికి ఆ బెత్తాన్ని తీసుకురావటం ఆ కుర్రాడికి ఎంత మాత్రమూ ఇష్టం లేదు. కాని తీసుకురాకపోతే మేష్టారి చేతిలో చావు దెబ్బలు తినక తప్ప దని అలా చేసాడు అయిష్టంగానే.

మేష్టారు చండశాసనుడు.

అయితేనేం? ఆయన మాట పడ్డాడు. ఆయన తల కొట్టేసినట్ల యింది.

ఆ రోజు ఉదయం ఆయన్ను ఉమాదేవి తండ్రి అలా అడిగి నప్పుడు-ఆయన తల భూమిలోకి దిగబడి పోయినట్టే అనిపించింది.

"క్లాసులో మాఅమ్మాయి, ఇంకో వెధవ ప్రేమ లేఖలు రాసు కుంటుంటే- మీరు ఏం చేస్తున్నారు మాష్టారూ? అసలు మీరు క్లాసుల్లో వుంటున్నారా? స్టాపు రూములో పడుకుని నిద్రపోతున్నారా?"

ఆ మాటలు మేష్టారి చెవుల్లో మరోసారి గింగురుమన్నాయి.

"ఇలా రా!" రంగబాబును ముందు పిల్చాడు మేష్టారు.

గజగజలాడిపోయాడు అతను.

అతను కూర్చున్న చోటునించి లేవలేకపోయాడు. వళ్ళంతా చెమ టలు పట్టింది.

"నిన్నే! రారా, రంగబాబూ!" మళ్ళీ పిల్చాడు ఆయన.

బలవంతాన లేచి నిలబడ్డాడు రంగబాబు. సింహం దగ్గరకు వెళు తున్న కుందేలు పిల్లలా నెమ్మదిగా మేష్టారి దగ్గరకు వచ్చాడు.

"చెయ్యి పట్టు!"

ఇక తప్పించుకోలేనని నిర్ణ

యించుకుని చేతిని ముందుకు చాచాడు రంగబాబు.

ఉమాదేవి గుండెలను ఎగ దన్నుకుని వస్తున్న దుఃఖాన్ని బలవంతాన ఆపుకుని భయంగా చూస్తోంది ఇద్దరినీ.

ఒక్కసారి మేష్టారు రంగ బాబు కళ్ళలోకి చూశాడు. అతని కళ్ళు భయంతో బెదురుతున్నాయి.

ఉన్నట్టుండి మేష్టారు ఆ బెత్తంతో శక్తి కొద్దీ అతని చేతి మీద కొట్టాడు.

ఉలిక్కిపడ్డారు క్లాసులో పిల్ల లందరూ.

కేక పెట్టాడు రంగబాబు.

మేష్టారు ఆగలేదు అంతటితో. ఆ బెత్తంతో అతని వంటిమీద వీరావేశంతో బాదుతూనే వున్నాడు.

ఉమాదేవి ఏడుపు మొదలు పెట్టింది.

మేష్టారు ఆగిపోయాడు.

రంగబాబు కింద పడిపోయాడు.

"నిండా పదిహేనేళ్ళు లేవు. అప్పుడే నీకు ప్రేమ కావలసి వచ్చిందా? ఇదేరా ప్రేమంటే! టెన్త్ క్లాసు చదువుతున్నావ్? నువ్వు ప్రేమలేఖలు రాస్తావా? ఇదే నీకు బహుమానం! నీ ప్రేమ ఫలితం అందుకున్నావుగా! ఇక వెళ్ళి కూర్చో. ఇంకోసారి ఇటువంటి వేషాలు వేశావంటే తోలు వొలుస్తాను."

క్లాసంతా నిశ్శబ్దంగానే వుంది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రంగబాబు యేడుస్తున్నాడు.

తర్వాత మేష్టారు తనే స్వయంగా ఉమాదేవి దగ్గరకు వెళ్ళాడు.

ఆ అమ్మాయి యేడుస్తోంది.

"ఏమ్మా! రెండు రోజుల క్రితం పమిటలు వెయ్యటం మొదలు పెట్టావ్. అప్పుడే నువ్వు ప్రేమ మైకంలో పడిపోయావా? ప్రేమ లేఖలు రాస్తావా ఈ వయసుకే? అందుకే ఈ ప్రేమ బహుమతి!" అంటూ ఆ బెత్తంతో ఉమాదేవి భుజం మీద కొట్టాడు ఆయన.

కెవ్వుమన్నది ఉమాదేవి.

"ప్రేమట! ప్రేమ పిచ్చి పట్టి ఛస్తున్నారా? అసలు మీరు ఇక్కడకు ఎందుకొస్తున్నారు? ప్రేమ లేఖలు రాసుకోవటానికా? చచ్చిపోతారు, జాగ్రత్త!" అని బెదిరించి వచ్చి కుర్చీలో కూర్చున్నా డాయన.

రంగబాబు, ఉమాదేవి తల వంచుకుని యేడుస్తున్నారు. క్లాసులో పిల్లలు వాళ్ళిద్దరినీ జాలిగా చూస్తున్నారు.

* * *

"డేవిడ్! నువ్వు నన్ను మోసం చెయ్యవు గదా?" అన్నది మనోరమ.

"నువ్విలాంటి చెత్త ప్రశ్నలు అడిగితే నాకు కోపం వస్తుంది. అప్పుడు నిన్ను మోసం చేస్తాననే చెబుతాను" అన్నాడు డేవిడ్ కోపంగా మనోరమను చూసి.

"ప్లీజ్! నన్నర్థం చేసుకో, డేవిడ్! ఒకసారి ఇంట్లో నించి బయటకు వచ్చిన తర్వాత- ఇక మళ్ళీ ఇంట్లో అడుగు పెట్టట మంటూ జరగదు. నా భయం నీకేం తెలుసు?" అన్నది సర్వరు తెచ్చిన కాఫీ కప్పును అందుకుని.

"నాకు తెలుసు రమా! నేను నిన్ను ఎంత గాఢంగా ప్రేమించానో నీకు తెలుసు. అందుకే మన పెళ్ళికి మీ ఇంట్లో ఒప్పుకోరని నువ్వు చెప్పినప్పుడు-ఎక్కడైనా లేచి పోయి పెళ్ళి చేసుకుందామని అన్నాను. ఇంకా నువ్వు నన్ను నమ్మకపోతే....ఆల్‌రైట్- మనం ఇప్పుడే విడిపోదాం" అన్నా డతను కాఫీ కప్పును క్రింద పెట్టి.

"డేవిడ్!" అన్నది మనోరమ కంగారుగా.

"అవును. అంత నమ్మకం లేనప్పుడు నువ్వు నాతో రావటం వేస్ట్!" అన్నాడు.

"సారీ! ఇంకోసారి ఇలా అనను డేవిడ్! చెప్పు-రాత్రి ఎన్ని గంటలకు బయటకు వచ్చెయ్యను? నిన్నెక్కడ కలుసుకునేది?" అడిగింది మనోరమ.

"రాత్రి సరిగ్గా ఒకటిన్నరకు రైలు స్టేషన్ దగ్గరకు వచ్చెయ్. నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను" అన్నాడు.

"తప్పకుండా నువ్వు వస్తావుగా?"

"అదిగో! మళ్ళీ మొదటి కొస్తు న్నావు!" అన్నాడు డేవిడ్ సిగరెట్టు వెలిగించుకుని.

"సారీ! నేను ఆడదాన్ని. సహజంగా కొంత భయంగా వుంటుంది. ఆ భయం కొద్దీ ఇలా అంటున్నాను. నువ్వు ఫీలవ్వకు. నిన్ను ప్రేమించాను. నిన్ను నమ్మాను. నువ్వే నా సర్వస్వ మనుకున్నాను. చావయినా, బ్రతు కయినా, స్వర్గమయినా, నరక మయినా నీతోనే డేవిడ్! ఐ లవ్ యూ!" అన్నది మనోరమ ఆవేశంగా.

నవ్వాడు డేవిడ్- సిగరెట్టు పొగను మనోరమమీదికి వూదుతూ.

* * *

తెల్లారి ఆరు గంటలు కావస్తుం డగా వరండాలో పడుకున్న శివ

రామయ్య మేష్టారిని కంగారుగా నిద్ర లేపింది ఆయన భార్య శారదాంబ.

"ఏమిటి? ఏమిటీ కంగారు?" అన్నా డాయన మంచం మీద లేచి కూర్చుని.

"అమ్మాయి మనోరమ ఇంట్లో నించిలేచి పోయింది!" చెప్పిందామె.

ఆ మాటలను వినగానే ఆయన మొహానికి ఎవరో నల్లటి రంగు పూసినట్లనిపించింది.

ఈ మాటలను మేష్టారి ప్రక్క పోర్షన్‌లో వుంటున్నామె వాకిలి వూడుస్తూ విని, ఆమె కూడా వులిక్కిపడింది.

"ఇదిగో, ఉత్తరం రాసిపెట్టి మరీ వెళ్ళింది" అని ఓ కాయితాన్ని ఆయనకు అందించింది.

'నాన్నా! వయసే నన్ను జయించింది. 'ప్రేమ' అంటే నువ్వు ఒప్పుకోవు. కాని ప్రేమ లేకుండా నేను బ్రతకలేను. నేను, డేవిడ్ ప్రేమించుకున్నాం. ఈ విషయం నీకు తెలిస్తే ఏం జరుగుతుందో నాకు తెలుసు. అందుకే తెలియకుండా జాగ్రత్తపడ్డాను. నీకు తెలిసి మా ఇద్దరి పెళ్ళి జరగటం అసాధ్యం. అందుకే అతనితో వెళ్ళిపోతున్నాను. కూతురి పెళ్ళి చేసే బాధ్యత తప్పిపోయిందని అనుకుంటావో, నీ పరువు మర్యాదలను మంటగలిపానని కుళ్ళిపోతావో- నీ ఇష్టం.- మనోరమ.'

ఏడుస్తోంది మేష్టారి భార్య.

అప్పుడే ప్రక్క పోర్షన్‌లో వున్నామె ఈ ముఖ్యమైన వార్తను నలుగురికీ చెప్పటానికి బయటకు వెళ్ళిపోయింది.

మేష్టారికి మళ్ళీ తల భూమిలోకి దిగబడిపోతున్నట్టు అనిపించింది.

'తను పెంచి పెద్ద చేసిన కూతురు తననే వేలెత్తి చూపుతూ ఎవడితోనో లేచిపోయింది. ఈ లోపం తనదేనా?' ఆయన కళ్ళ ముందు ఉమాదేవి,రంగబాబు మెదిలారు. వాళ్ళిద్దరినీ ఏడ్చేలా కొట్టిన దృశ్యం కూడా ఆయన కళ్ళ ముందు కదిలింది.

'ప్రేమ ఇంతటి బలీయమైనదా? ప్రేమకు వయసుతో పని లేదా?' అనుకున్నా డాయన. ఆ తర్వాత ఆయన ప్రేమ గురించి ఆలోచిస్తూ వుండిపోయాడు చాలాసేపు.

చివరికి-ఆ రోజు ఉదయం స్కూలుకు వెళ్ళగానే ఉమాదేవికీ, రంగబాబుకీ మేష్టారు క్షమాపణలు చెప్పుకుంటున్నప్పుడు, వాళ్ళిద్దరితో పాటు క్లాసులో పిల్లలందరూ ఎనిమిదో వింతను చూస్తున్నంతగా ఆశ్చర్యపోయారు. ✱